# గుణపాఠం

ఉమాదేవి

ఇంతమంది ఆడవాళ్ళను చూసేను కాని లలిత లాగ డాబులు కొట్టేవాళ్ళని ఎక్కడా చూడలేదు. ఏవిషయంలోనైనా, మీరు ఔను అంటే లలిత కాదు అనకపోతే ఒట్టు. ఈ వస్తువు 10 రూ, కి కొన్నానండి. "10 రూ కి దండుగ; మీరు దగాపడిపోయారు" అంటుంది తను మహా తెలివైనదాని లాగ బజారు ధరలన్నీ తెలిసినట్టు. పుట్టినింటికి వెళ్ళి మొగుడుపంపిన డబ్బుతో కొన్న వస్తువులన్నీ మాపుట్టింటివారు పెట్టారంటుంది. తనకుకొబట్టి అంతమంచివి చాలా చవకగా దొరికాయి అంటుంది. నలుగురు ఆడవాళ్ళు ఒకచోట కూర్చుని పాడుకుంటూ మనుకోండి. మాచెల్లెలు సూరయ లాగ పాడుతుంది; మాతమ్ముడు సైగల లాగ పాడుతాడు అంటుంది. కాని తనకు మాత్రం పాడటం రాదులెండి. విమర్శనలు జోరుగ ఒకరిమీద చేస్తుంది. లలిత ఉన్నచోట, ఇంట్లోవుండే వుప్పు మిరపకాయమొదలు అంతర్జాతీయ విషయాల వరకు అన్నిటిలోను ఆవిడదే అగ్రస్థానం తాను ఒక్కర్తే చాల తెలివైనదనుకుటుంది మిగతా వాళ్ళంతా వట్టిచవట వెధవలని, అయితే ఆవిడ తెలివితేటల ప్రదర్శనమంతా మాలోనే సుమండి!!

కొందరు సహింపక పోయినా, నేనుమాత్రం ఎన్నడు లలితతో వాదించను. ఇంకా ఉబుసుపోకపోతే ఆమెదగ్గరకు వెళ్ళి ఊకొట్టేనంటేచాలు మాటలు కోటలు, పేటలు దాటుతాయి. నాపుట్టిన రోజు పండుగకి మా ఆయనొక మధురచీర 171 - రూ,, కి కొన్నారు. చీర చాల బాగుంది. లలితకు చూపించేను, ఉక్రోషంకొద్ది, "చీర బాగుంది.. కాని ... ధరహెచ్చు పెట్టేశారు" అంది, నాలోనేను నవ్వుకున్నాను.

• బజారులోకి క్రొత్తగ నారచీరలు వచ్చాయి. వేలం వెర్రిగ అంతా అవే కొనుక్కుంటున్నారు. చవకగా ఉన్నాయి. పైకిసిల్కు చీరలలా మెరిసి పోతున్నాయి.

అవకాశం తీసుకుని లలితను గుణపాఠం నేర్పా లనుకొన్నాను, మాఆయనని వేధించుకొని నాకొక చీర తెప్పించుకున్నాను. చీర లేతాకు పచ్చరంగులో నుండి, చక్కటి అంచు, అంచు మీద చెమ్కీ అద్దిఉంది. లలిత చీర చూడగానే "చాలబాగుంది, ఎంతకు కొన్నారేవిటి?" అంది, తడుముకోకుండా "ఇది మూర్షిదాబాదు సిల్కు చీర. 281 - రూ,, కి కొనితెచ్చారు మావారు" అన్నాను లలిత చీర నచ్చినట్లుంది, "నాకు కూడా ఒకటి తెప్పించిపెడతారా" అంది "అలాగే" అన్నాను. 281 - రూ,, కి తెచ్చి నా చేతిలో ఉంచింది. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేటప్పుడు మా ఆయన మరొక చీరతెచ్చారు. గులాబీరంగులో అక్కడక్కడ చిన్న చిన్న పువ్వులతో అద్దకం చాలాబాగుంది. లలితకి అందిచ్చాను నాచీరకన్నా బాగుందని మురిసి పోయింది,

శ్రావణ మంగళవారం పేరంటానికని వెళ్ళి తిరిగి వచ్చింది లలిత. నేను వంటింట్లో ఏదోపని చేస్తున్నాను. తిన్నగ వంటింట్లోకి వచ్చింది లలిత ముఖము చూస్తే చాలాకోపంగా వుంది. ఏదోజరిగిందనుకున్నా. "ఏమండీ. ఇలా దగా చేస్తారనుకోలేదు, చవకరకం చీరతెచ్చి నాముఖాన్న కొట్టేరు; డబ్బుదండుగయి పోయింది .." అని ఇంకా వాగుతున్నాది తన ధోరణిలో, నేను వస్తున్న నవ్వు అపుకొని "అసలు ఏమిటి జరిగిందేమిటి? అక్కయ్యగారు" అన్నాను, "ఏమిటేమిటి? ఒక్కసారి సరదాగా కట్టుకొని పేరంటానికని వెళ్ళి తిరిగి వచ్చేసరికల్లా పీకిపోయింది. మూర్షిదాబాదు సిల్కుచీర" అంది, నా ఎదుటే చీర విప్పేసి నాముఖాన్న కొడుతుం దేమో అన్నంత భయంవేసింది ఆమె వాలకం చూస్తే, "చీరమంచిదే కాని ... సిల్కు .. నారసిల్కు అయి ఉంటుందండి" అన్నాను నవ్వుతూ, "అయితే నార చీరా" అంది లలిత, నవ్వాపుకోలేక పెరట్లోకి పోయాను నేను.